క్లుప్తంగా

హెలిప్యాడ్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పూజిత

వెంకటాచలం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 31 తేదీన నెల్లూరుకు రానున్నారు. ఈ నేపథ్యంలో చెముడుగుంట సెంట్రల్ జైలు సమీపంలో జరుగుతున్న హెలిప్యాడ్ పనులను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత మంగళవారం పరిశీలించారు. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలతో వెళ్లి పనుల గురించి ఆరాతీశారు.

అడవిని తలపిస్తున్న పార్కు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో నిర్మించిన పార్కు అడవిని తలపిస్తోంది. గతంలో ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం ఉండేది. సాయంత్రం వేళల్లో ప్రజలు వచ్చి సేదతీరేవారు. అయితే కొంతకాలంగా పార్కును పట్టించుకోకపోవడంతో ముళ్లకంపలతో నిండిపోయి అడవిలా తయారైంది. లేఅవుట్ నిర్మాణం సమయంలో పార్కును నిర్మించారు. తర్వాత నిర్వహణను పంచాయతీకి అప్పగించారు. స్వచ్ఛంద సంస్థల వారు, గ్రామపెద్దలు కొద్దిరోజులు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం పార్కు అధ్వాన స్థితిలో ఉంది.

యథేచ్ఛగా ఇసుక తరలింపు



జొన్నవాడ వద్ద నదిలో ఏర్పడిన గుంతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెన్నా తీర ప్రాంతాల్లో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఇసుకను తరలించరాదనే అధికారుల ఆంక్షలను కూటమి నేతలు లెక్కచేయడంలేదు. మినగల్లు, జొన్నవాడ, బాపనపాడు, పెనుబల్లి గ్రామాల వద్ద నుంచి ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నది రూపురేఖలు మారిపోయాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేడుకగా మంగళగౌరీ వ్రతం



కోవూరు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మంగళగౌరీ వ్రతాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు.

పీ4 పేరిట ఉద్యోగులపై భారం

కోవూరు: పీ4 పేరిట సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం భారం మోపుతోందని యునైటెడ్ వెల్ఫేర్ గవర్నమెంట్ ఎంప్లాయిూస్ అసోసియేషన్ (236 / 24) రాష్ట్ర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో పలువురు సిబ్బందితో కలిసి మంగళవారం ఆమె మాట్లాడారు. జీతాల కోసం నిరీక్షిస్తున్నామని చెప్పారు. పేద కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఒత్తిడి చేయడమేమిటని ప్రశ్నించారు. మధ్యంతర భృతి, డీఏ ఇవ్వడంలేదని చెప్పారు. పీ4 మార్గదర్శకులుగా రిజిస్ట్రేషన్ నుంచి మినహాయించాలని, లేని పక్షంలో కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 473 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 263 బేళ్లను కొనుగోలు చేయగా, వివిధ కారణాలతో 210 బేళ్లను తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160 పలుకగా, సరాసరి రూ.187.53 లభించిందన్నారు. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

శిథిలావస్థకు చేరి.. కూలేందుకు సిద్ధంగా..

- ప్రమాదపుటంచున అట్టిడి
- కూలిపోతే మాగాణి ఎడారే..
- ఆందోళనలో అన్నదాతలు

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులోని మాగాణి పొలాలకు సాగునీరు సరఫరా అయ్యే అట్టిడి (కండలేరు ఉపకాలువపై వంతెన) శిథిలావస్థకు చేరి ప్రమాదరకంగా ఉంది. ముందుచూపుతో వ్యవహరించాల్సిన ఇరిగేషన్ అధికారులు దీని గురించి పట్టించుకోవడం మానేశారు. అట్టిడి ఏ క్షణంలో అయినా కూలిపోయేలా ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

90 శాతం పొలాలకు..

మనుబోలులోని 90 శాతం మాగాణి పొలాలకు ఈ మార్గం గుండానే సాగునీరు సరఫరా అవుతుంది. పెద్దచెరువు నుంచి పొలాలకు వెళ్లే పంట కాలువకు అడ్డుగా కండలేరు ఉపకాలువ ఉంది. అందులోని సాగునీరు కండలేరు వాగును దాటేందుకు బ్రిటిషర్ల కాలంలోనే అట్టిడి నిర్మించారు. వంతెనపైన కూడా కాలువలా ఏర్పాటు చేయడంతో నీరు వాగు అవతలి వైపునకు చేరి తిరిగి పంట కాలువలో కలుస్తుంది. అయితే కొన్నేళ్లుగా అట్టడి శిథిలావస్థకు చేరుకుని పలుచోట్ల లీకుల కారణంగా నీరు వృథా అవుతోంది.

వర్షాల కారణంగా..

అసలే అంతంతమాత్రంగా వంతెన ఉంది. 2015 సంవత్సరంలో నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో బాగా దెబ్బతింది. ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిని నేడో.. రేపో కూలేలా ఉంది. ఇది కూలిపోతే మనుబోలులోని సుమారు 1,200 ఎకరాలకు సాగునీరు అందకుండా పోతుంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన నూతనంగా వంతెన నిర్మించాలని, వచ్చే రబీ సీజన్‌లోపైనా లీక్‌లకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాని రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న అట్టిడి



కింది భాగంలో వృథాగా పోతున్న నీరు

సాగునీరు వృథా అవుతోంది



చాలాఏళ్లుగా అట్టిడి శిథిలావస్థలోనే వుంది. ఏదైనా జరిగి అట్టిడి కూలిపోకముందే జాగ్రత్త వహించాలి. లీకుల కారణంగా సాగునీరు వృథాగా పోతుంది. దీంతో పంట చివరిదశలో చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారాన్ని కనుక్కోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోవల్సి వస్తుంది.

– బొమ్మిరెడ్డి ధనంజయరెడ్డి, రైతు, మనుబోలు

కొత్తది నిర్మించాలి



అట్టిడి బ్రిటిషర్ల కాలంలో నిర్మించారు. కాలపరిమితి దాటిపోయింది. తాత్కాలిక మరామ్మతుల వల్ల ఉపయోగం లేదు. ఇది పూర్తిగా కూలిపోకముందే పక్కనే కొత్తగా బ్రిడ్జి నిర్మించాలి. లేదంటే సాగునీరు అందక వెయ్యి ఎకరాలకు పైగా ఎడారిగా మారిపోయే ప్రమాదం ఉంది.

– కలికి వెంకటస్వామిరెడ్డి, రైతు, మనుబోలు

మరమ్మతులకు నిధుల మంజూరు

సాక్షి ఎఫెక్ట్..



వివరాలు సేకరిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ తిరుపతయ్య

తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు ఎస్సీ బాలురు వసతి గృహం మరమ్మతులు, నూతన గదుల నిర్మాణానికి సంబంధించి రూ.29 లక్షల మంజూరైనట్లు కోవూరు సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు తిరుపతయ్య తెలిపారు. ఈనెల 28వ తేదీన సాక్షిలో వచ్చిన 'సంక్షోభ హాస్టళ్లు' కథనానికి తిరుపతయ్య స్పందించారు. మంగళవారం వసతి గృహాన్ని పరిశీలించి, వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహం శిథిలావస్థకు చేరి, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సంగతి వాస్తవమేనన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరిగిందన్నారు. దీంతో ఇటీవల నిధులు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం టెండర్ దశలో ఉందని, త్వరలోనే పనులు ప్రారంభించి విద్యార్థుల సమస్యలను తీరుస్తామన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



మనుబోలులో..



పొదలకూరులో..

మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలోని గమళ్లపాళెంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పుచ్చకాయల వెంకటకృష్ణయ్య, అనిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

- **పొదలకూరు:** పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అత్యంత వైభవంగా పూజలు జరిగాయి. గాండ్ల జన సేవా సంఘం ఉభయకర్తగా వ్యవహరించింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామికి పల్లకి సేవ జరిగింది.

సబ్‌స్టేషన్లో ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆటోనగర్ సబ్‌స్టేషన్‌ను ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, సర్క్యూట్ బ్రేకర్లు, అంతరాయాలు తదితరాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సబ్‌స్టేషన్లో రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి.. అంతరాయాల్లేని విద్యుత్‌ను అందించాలని కోరారు. నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, డీఈఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, బెల్టు దుకాణాలతో తీవ్ర ఇబ్బందులు

- మహిళల ఆవేదన

ఆత్మకూరు: ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ పట్టణంలో గ్రామాల్లో పుట్టగొడగుల్లా మద్యం, బెల్టు దుకాణాలు వెలిశాయని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళవారం సీఐటీయూ, సీపీఎం నేతల సహకారంతో మహిళలు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారులకు సమీపంలో ప్రార్థనా స్థలాలు, దేవాలయాల దగ్గర, మెయిన్ బజారులో ఇష్టారాజ్యంగా బెల్టు దుకాణాలు ఏర్పాటయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతులున్నా మద్యం దుకాణాలు సైతం నిర్దేశించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో పలు పనులపై బజార్లకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ముఖ్యంగా బెల్టు దుకాణాలకు సమయపాలన లేకపోవడంతో తాగుబోతుల విచ్చలవిడితనం ఎక్కువైందని వారు వాపోయారు. కాగా ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కన్వీనర్ డేవిడ్‌రాజు, ఎ.నాగయ్య, గుల్జార్‌బేగం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో చేపట్టిన మహాకుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా మహాగణాధిపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర పూజా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కంచిపీఠ ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు జరిపారు. ఆలయ జీర్ణోద్ధరణ, విమాన గోపుర పునర్నిర్మాణ దాత ఆల్తూరు సులోచనమ్మ, నవగ్రహ మండప దాతలు పసుపులేటి సుబ్రహ్మణ్యం, నరసింహారావు, ఈఓ జనార్దన్‌రెడ్డి, ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి పాల్గొన్నారు.

ఉక్కపోతకు జనం ఉక్కిరిబిక్కిరి

పొదలకూరు: ఆగస్టు సమీపిస్తున్నా వేసవి భగభగలు ఏమాత్రం తగ్గడం లేదు. ఎండల వేడిమి, ఉక్కపోతకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాధారణంగా ఈ సమయానికి వాతావరణం చల్లబడి అడపాదడపా వర్షాలు కురుస్తుండాలి. రైతులు ఖరీఫ్‌లో మెట్టపంటల కోసం దుక్కిదున్నకం పనులు చేపట్టాలి. అయితే ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ప్రజలు అల్లాడుతున్నారు. రాత్రి వేళల్లో సైతం ఉక్కపోత విపరీతంగా ఉంటోంది.

పిల్లలకు ఆరోగ్య పరీక్షలు




కొడవలూరు: మండలంలోని తలమంచి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలను కొడవలూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఏ శ్రీనివాసులు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు బరువు, ఎత్తు, రక్తశాతం తదితర ఆరోగ్య పరీక్షలను ప్రతి నెలా నిర్వహిస్తున్నామని వివరించారు. ఏఎన్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

నెల్లూరు(బారకాసు): సమ్మెను మున్సిపల్ కార్మికులు విరమించారని కమిషనర్ నందన్ తెలిపారు. మున్సిపల్ కార్మిక సంఘాల నేతలతో చర్చలను కార్పొరేషన్ కార్యాలయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కమిషనర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొమ్మిదో డివిజన్లో కాంట్రాక్ట్ విధాన అమలుపై మంత్రి నారాయణ స్పష్టతివ్వడంతో కార్మికులు సమ్మెను విరమించారని కమిషనర్ తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన కాంట్రాక్ట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేసి నూతన విధి విధానాలపై పునరాలోచించేందుకు మంత్రి నారాయణతో కార్మిక సంఘాల నేతలు భేటీ కానున్నారని పేర్కొన్నారు. నేతలు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, పెంచలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పాటలు, నృత్య పోటీలు రేపు



నెల్లూరు(బృందావనం): కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి పాటలు, డ్యాన్స్ పోటీలు, నృత్య ప్రదర్శనలను నగరంలోని పురమందిరంలో గురువారం నిర్వహించనున్నామని ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను టౌన్‌హాల్లో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాల్గొనాలనుకునే కళాకారులు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. రఘురామిరెడ్డి, అమానుల్లాఖాన్, ముత్యాల రవీంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రహదారిని తవ్వేసి.. గుంతల్ని పూడ్చకుండా..

- వాహనచోదకులకు ఇబ్బందులు



గ్రామీణ ప్రాంతంలో తవ్వేసిన రహదారి

పొదలకూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా రహదారులను తవ్వేస్తుండటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రైతులు రోడ్డును తవ్వేసి పైపులు వేసుకుని గుంతలను సక్రమంగా పూడ్చడం లేదు. దీంతో వర్షం కురిసినప్పుడు పరిస్థితి దారుణంగా మారుతోంది. ముఖ్యంగా రాత్రి సమయంలో ద్విచక్ర వాహనచోదకులు, కొత్తగా ఆ మార్గం గుండా ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. అసలే మలుపులు అధికంగా ఉన్న రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దాదాపుగా అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇదే సమస్య ఉన్నట్టు ప్రజలు వెల్లడిస్తున్నారు. చాటగొట్ల – బిరదవోలు మార్గంలో ఇదే తరహాలో పైపులు వేసి సక్రమంగా పూడ్చకపోవడంతో గతేడాది ఓ టీచర్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు.

నేల సారాన్ని కాపాడుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

మనుబోలు: రైతులు తమ పొలాల్లో జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని కాగితాలపూరు, ఎస్ఎస్‌పురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి స్వభావానికి అనుకూలమైన పంటల సాగు, ఎరువుల వినియోగం చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలని వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. యూరియా ఎక్కువగా వినియోగిస్తే వరిలో పురుగులు, తెగుళ్లు ఎక్కువయ్యే ప్రమాదం ఉందన్నారు.

లేగదూడలకు అందాల పోటీలు



లేగదూడలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని ముసునూరువారిపాళెం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం లేగదూడలకు అందాల పోటీలు నిర్వహించారు. 46 మంది పాడిరైతులు తమ లేగదూడలను తీసుకొచ్చారు. పశుగణాభివృద్ధి సంస్థ నుంచి బహుతులను అందజేశారు. దూడలకు వచ్చే సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. నట్టల నివారణ మందులు, కాల్షియం టానిక్‌లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసరావు, నెల్లూరు డీడీ నాగమణి, ముత్తుకూరు ఏడీఏ పి.నిర్మల, బ్రహ్మదేవం, ముసునూరువారిపాళెం, వల్లూరు పశువైద్యాధికారులు శివశంకర్‌రెడ్డి, గోవర్ధన్, వాణిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో తెగుళ్ల నివారణ



కొడవలూరు: సూచనలిస్తున్న అనిత



కోవూరు: గంగవరంలో..



ఇందుకూరుపేట: జగదేవిపేటలో..

కొడవలూరు: లింగాకర్షక బుట్టలు, ట్రైకో కార్డుల ఏర్పాటు ద్వారా తెల్ల, మోముపిప్పి తదితర తెగుళ్లను నివారించుకోవాలని కోవూరు ఏడీఏ అనిత సూచించారు. మండలంలోని పెమ్మారెడ్డిపాళెం, యల్లాయపాళెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. అన్నదాతా సుఖీభవ జాబితాలో అర్హులుగా ఉన్న రైతుల్లో కొందరి బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదని చూపుతోందని తెలిపారు. ఇలాంటి వారు వీఏఏను సంప్రదించి నిర్ధారించుకోవాలని కోరారు. పంటల బీమాకు గడువున్న తరుణంలో ప్రీమియాన్ని చెల్లించాలని పేర్కొన్నారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డులను చేయించుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో పచ్చి రొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నారని వెల్లడించారు. ఏఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- **కోవూరు:** మండలంలోని గంగవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రజని మాట్లాడారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల ఉపయోగం తదితరాలపై అవగాహన కల్పించారు.
- **ఇందుకూరుపేట:** పంటను రైతులు తప్పక నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేటలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వీహెచ్ఏ దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సందర్శన

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న తిరుపతయ్య

కోవూరు: ప్రభుత్వ వసతిగృహాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని సంక్షేమ శాఖ వసతిగృహాధికారులు పేర్కొన్నారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై సాక్షిలో సోమవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ క్రమంలో కోవూరు ఏఎస్‌డబ్ల్యూఓ తిరుపతయ్య మంగళవారం పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వసతిగృహ సంరక్షకులు పద్మజ, మేరీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



విజయన్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని విద్యుత్ భవన్‌లో ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రాన్ని యూనియన్ నేతలతో కలిసి మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులను విద్యుత్ సంస్థలో 2007లో అప్పటి సీఎం వైఎస్సార్ విలీనం చేసిన అంశాన్ని గుర్తుచేశారు. కాంట్రాక్ట్ కార్మికులను ప్రస్తుతం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్‌కు వినతి పత్రమిచ్చారు. నేతలు పెంచలప్రసాద్, నాగయ్య, దయాకర్, ప్రసన్న, మనోజ్‌కుమార్, సునీల్, శ్రీనివాసులు, ఆరిఫ్, వసంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

నెల్లూరు సిటీ: తనపై ముగ్గురు దాడి చేశారంటూ నెల్లూరు రూరల్ పోలీసులకు యువకుడు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. ఆకుతోటకు చెందిన పురుషోత్తం అదే ప్రాంతంలోని వసంత్ వద్ద సెంట్రింగ్ పని చేస్తున్నారు. కొంతకాలంగా వసంత్, అతని సోదరుడు వినయ్ మధ్య విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో వసంత్ వద్ద పని చేయొద్దని వినయ్ సూచించారు. అయితే పురుషోత్తం మాత్రం వసంత్ వద్దే పనిచేస్తున్నారు. దీనిపై కక్ష పెంచుకొని పురుషోత్తంపై బన్నీ, సారథితో కలిసి వినయ్ ఆదివారం అర్ధరాత్రి దాడి చేశారు. అడ్డుకోబోయిన పురుషోత్తం తల్లిపై సైతం దాడికి పాల్పడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.